# నస

నస సమ్రాట్ - విశ్వ నస సార్వభౌమ - నస చక్రవర్తి గోవిందరావు అత్త వారిచ్చిన డబల్ కాట్ డబల్ బెడ్ మీద అట్నుంచిటు అతికష్టంమీద ఒత్తిగిలి లుంగీ అనుకుని దుప్పటి మీదకు లాక్కున్నాడు. గడియారం తొమ్మింబావు దగ్గర టిక్కు టిక్కు మంటూండగా - అనంతలక్ష్మి తలంటోసుకుని పిడస పెట్టున్న తలతో "లేవండీ లేవరూ" అని బతిమాలుతూ మంచంచుట్టూ కాలు కాలిన పిల్లిలా తిరుగుతోంది.

నస సామ్రాట్ కళ్లు తెరిచి, ఆవులించి బద్ధకంగా ఒళ్లు విరుచుకోడానికి, బెడ్ కాఫీ తాగి ఓ చార్మినార్ ముట్టించి, లేచి నిలబడ్డానికి ముప్పై నిమిషాలు పడుతుంది. లేవగానే చంటి పిల్లతో ఆడుకోడానికి పావుగంట, ముఖప్రక్షాళ నాదికాలకు మరో అరగంట, మళ్ళీ మరో అరకప్పు కాఫీ మరో సిగరెట్టు ముట్టించాక కాని షేవింగ్‌కి దిగడు. షేవింగై మళ్ళీ చంటి పిల్లను ముద్దాడి స్నానం చేసేసరికి గంట - స్నానానంతరం నీరసం రాకుండా టిఫినూ కాఫీలు పూర్తిచేసి, మరో సిగరెట్టు ముట్టించి తల దువ్వింగ్ అండ్ డ్రెస్సింగ్ పూర్తిచేసి పాలిష్

అయిన జోళ్ళు తొడిగి లేచి వీధిలోకి అడుగు పెట్టేసరికి పదకొండున్నర దాటేస్తుంది. రోజూ గోవిందరావుని లేపి ఆఫీసుకు తోలేసరికి అనంతలక్ష్మికి ఫిట్సొచ్చినంత పనవుతుంది. మూడు చేపల కథలో దీర్ఘసూత్రుడిలాంటివాడు గోవిందరావు. అతని చేత చెప్పి ఏదైనా పని చేయించుకోవాలంటే అనంతలక్ష్మికి తల ప్రాణం తోకకి వస్తూ వుంటుంది. పెళ్ళి ఫొటోకి ఫ్రేం కట్టించమని కతపోరితే అది షాపులో యిచ్చాక ఏణ్ణర్ధానికి పాప డెలివరీకి ముందు యింటికొచ్చింది. మనుగుడుపులకు పెట్టిన ప్యాంటూ షర్టూ కుట్టించుకోడానికి టైలర్ కివ్వడానికి ఏడాది పట్టింది. అది తెచ్చుకుని తొడుగుకునేసరికి పాపకు మూన్నెల్లూ వెళ్ళాయి. బారసాలకు పెట్టిన బట్టలు పిల్ల పెళ్ళి నాటికయినా కుట్టించుకుంటారో లేదో అని వాపోతూవుంటుంది అనంతలక్ష్మి.

నిన్నటికి నిన్న లేటుగావచ్చి శేషశాయిలా మంచం మీద వాలిన భర్తను తెగబతిమాలింది, పెందరాళే లేచి లారీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుకెళ్ళి సామాన్లు వచ్చాయో లేదో చూసి తెమ్మని. అల్లాగే పెందరాళే లేపమని గోవిందరావు లారీని గురించి మాట్లాడవద్దని నోరు మూశాడు. ఎక్కడలేని చురుకూ యిక్కడొస్తుందని అనంతలక్ష్మి విసుక్కుంది.

లేవనంటున్న గోవిందరావుని లేపడంకోసం ఆఖరిఅస్త్రాన్ని ప్రయోగించింది అనంతలక్ష్మి చంటిపిల్లను తెచ్చి గుండె మీద

కూచోపెట్టింది. గడియారాన్ని చూసి భయపడనివాడు ప్రపంచంలో మరిదేనికీ భయపడడు. చంటిది నాన్న పొట్టమీద కేరింతలు కొట్టగా కొట్టగా—

"దానికీ వేళ ఉయ్యాల కట్టాలండీ" అంది గోముగా.

"కద్దాం" అన్నాడతను అది ఎటువంటి ప్రమాదమో ఊహించలేక.

"మరి వెళ్ళి తీసుకురారూ" అని ముద్దుగా దీర్ఘాలు తీసింది. అప్పుడు అనంతలక్ష్మిని ముద్దాడాలని అనిపించి గోవిందరావు ఆమెను ఆశగా పట్టకోబోయాడు.

"ఛీ" అంటూ- ఇప్పుడు కాదని సిగ్నల్సు కొడుతూ వెళ్ళిపోయింది అర్ధాంగి.

"నాన్సెన్స్" అంటూ అటు తిరిగి పిల్లను పరుపుమీదకు దించి ఆడిస్తూ చార్మినార్ వెలిగించి ట్రాన్సిస్టర్ ట్యూన్ చేశాడు. మంచంమీంచి లాంగ్ షాట్ లో కట్ చేసుకుంటూ పోతే అనంతలక్ష్మి వంటింట్లో చీర మార్చుకుంటోంది. స్టవ్ మీద పెనం, పెనంమీద పెసరట్టు "చుంయ్ - చుంయ్" మంటూ చిందులేస్తోంది. అలా డ్రస్సింగవుతూనే వంటింట్లో ఒక్కోపని చుట్టబెడుతూ వుంటుంది అనంతలక్ష్మి. బాడీ వేసుకున్నాక గంటకో గంటన్నరకో గాని జాకెట్ వేసుకోదు. అన్నీ ఒక్కసారవాలంటే నాకు పది చేతులా, పదికాళ్ళా అంటుంది కాని పూర్తిగా డ్రెస్ చేసుకుని పన్లు చూసుకోమంటె విన్దు "షి ఈజ్ కిల్లింగ్ మీ ఎవ్వెరి మినిట్" అనుకుంటూ

సిగరెట్ నలిపి ఆష్‌ట్రేలో కుక్కాడు గోవిందరావు. పెళ్ళాలు అందంగా వుండక్కరలేదు. కాస్త కేర్‌లెస్‌గా వుంటేచాలు అదే అందం! సో - అందం అంటే అదికూడా ఓ బుద్ధి కొలతే. కొ. కు. చెప్పినట్లు. ఇలా ఆలోచిస్తూండగా దబ్బుమనిచప్పుడూ కెవ్వుమని కేక వినిపించాయి. గోవిందరావు ఖంగారుపడి లేచే సరికి చంటిపిల్ల మంచంమీద దొర్లి వుండ్రం ముక్కలా కింద పడింది. అనంతలక్ష్మి పరుగు పరుగునవచ్చి గుక్కపట్టిన పిల్లని ఎత్తుకుని సముదాయిస్తూ "మీ దగ్గర వొదిలేస్తే యింతే- పిల్లని చూసుకోరుటండీ ఖర్మ" అని నెత్తిబాదుకుంది. "సారీ లక్ష్మీ" అని పిల్లని అందుకోబోయాడు. ఇవ్వకుండా లోపలకు పరగెత్తి వేలితో పంచదార తీసి పిల్ల మూతికి అద్దింది. అది టక్కున ఏడుపు మర్చిపోయి వేలుచీకుతూ నీళ్ళునిండినకళ్ళతో గోవిందరావు కేసి చూసింది. పక్కింటివారి పనిపిల్ల "మీకు టెలిఫోన్ వచ్చిందండీ" అంటూ మెట్లమీంచి కేకేసింది. గోవిందరావు ఎలా వున్నవాడు అలానే వెళ్ళబోతే అనంత లక్ష్మి కళ్ళతో కొప్పడి లుంగీ సర్దుకుని తల దువ్వుకోమని, షర్టు వేసుకువెళ్ళమనీ సలహా పారేసింది. గోవిందరావు సిగ రెట్ పెట్టెతో సహా స్లిప్పర్లు తొడుక్కుని మబ్బులు మబ్బు లుగా మొగంమీదకు పడుతున్న జుట్టును చేత్తో సర్దుకుంటూ పక్కవారింట్లోకి ప్రవేశించాడు పగటిచుక్కలా.

పక్కింటివారి మేనకోడలు నవ్వుతూ "మీ కేనండీ" అంటూ రిసీవరందించి గోవిందరావును నఖశిఖ పర్యంతం

సినిమా హీరోని చూస్తున్నట్లు కళ్ళప్పగించి చూస్తూ నిలబడి పోయింది అనంతలక్ష్మికి ఈ చలాకీ సుందరి అంటే ఒళ్ళు మంట. ఎన్నాళ్ళకీ పెళ్ళిగాక కాస్త నదరుగావున్న మగాళ్ళకు చూపుల్తో తినేసే ఈ పిల్లంటే చెడ్డ చిరాకు- పైగా అందర్తో కబుర్లేసుకుంటుంది బంకలా. ఆ టెలిఫోను కాదుగాని ఈయన వెళితే ఓ పట్టాన కదల్రు - ఎక్కడలేని బాతాఖానీ- నవ్వులు, వికవికలు పకపకలు వచ్చేస్తాయి. కొంప తీసే కొరివి అని పళ్లు పిండుకుంటుంది అనంతలక్ష్మి. పైగా దాని మొహానికి బెల్ బాటమ్సూ ఫుల్‌హాండ్సు కమీజులూ, మెళ్ళో తులసిపేరూ, చెవులకి బండిచక్రాలంత రింగులూ, గోగోగాగులూ. లిప్ స్టిక్కూ, ఎత్తుమడమల జోళ్ళూ, ఎత్తులు ముందూ వెనకా చూపిస్తూ, తిప్పుకుంటూ యాంకీ భాషలో ఇంగ్లీషు వెలగ బెడుతుంది. దాన్నంతా హాయ్ హాయ్ విమ్మీ అంటారు. విమ్మీ అంటే విమల కొచ్చిన పాట్లు.

టెలిఫోనెత్తి హల్లో "గోవింద్ హియర్" అంటూ విమ్మీని చూసి ఎ థింగ్ ఆఫ్ బ్యూటీ ఈజ్ జాయ్ ఫరెవర్ అని ఎవడన్నాడు చెప్మా అని ఆలోచిస్తూ చిరునవ్వు అతికించు కున్నాడు మొహానికి.

"గోవిందా గోవిందా నేన్రా శాస్త్రిని"

"ఓర్నీ పొద్దున్నే ఎక్కడ్నించి వూడిపడ్డావ్రా?"

"షటప్ రాస్కెల్ - నిన్నరాత్రొచ్చాన్రా బెదర్. నీ కోసం బాటిల్లో పెన్సిస్కుని ఖూర్చుని కొట్టేస్తున్నాన్రోయ్!

ఖమాన్ మై బోయ్! మష్టూ రూం నంబర్ ఫోర్ నాట్ ఫోర్. యమబోర్ గా వుంది గురూ షెలవ్ పెట్టొచ్చేస్తావా - సింగల్ ఎంట్రీ బుక్కీపింగ్ చేస్తున్నావ్రా గురూ - టెన్ మినిట్సులో ఒచ్చేస్తావా?"

"ఉండుండు. మై వైఫ్ ఈజ్ యాంగ్రీ.. లారీ ట్రాన్స్‌పోర్టుకెళ్ళి ఉయ్యాలదిబ్బా, దిరుగుండం తేకపోతే మా ఆవిడ చంపేస్తుందిరా—"

విమ్మో పీటర్ పాన్ బ్రాసరీ అండ్ గర్ల్‌లా కిల కిల్లాడిపోతోంది.

"అరెయ్ నిన్నరాత్రి ఎక్కడ తగలడ్డావ్ బే-ణీ కోసం రింగ్ చేసి చేసి చచ్చాననుకో-యూ మస్ట్ అపాలైజ్. రారా వేగం-" గోవిందరావు గొంతు తగ్గించి,

"అప్పుడే తెల్లారకుండా చిన్న కుంపటి పెట్టావన్న మాట. అరె నువ్ లక్కీ-రా - పెళ్ళీ లేదు పెటాకుల్లేదు. రాత్రి మూడు గంటల్కొచ్చానురా, కళ్ళు మండిపోతున్నాయ్! మై వైఫ్ ఈజ్ మిస్సివస్-లారీ ఆఫీసు కెళ్ళాల్సిందే గురూ! ఎల్లీ రింగ్ చేస్తా..?"

"బేటా, అదేంకుదర్దు. ఇక్కడ్రా రా-మణిద్దరం ఓ లారీ కొనేద్దాం. నీ వైఫ్‌కి ఓ లారీకొని ప్రెజంట్ చేసే పూచీనాది. ఆఫ్టరాల్ బ్యాంక్‌వాళ్ళు లారీ కొంటానంటే లోనిస్తారోయ్!"

"పోనీ ఈవెనింగొస్తావ్రా - అప్పుడు ఫ్రీ"

"అరె నోర్మయ్ సమగా నువ్వూను, ఈ బాటిలంతా"

ఒకడ్నే టాగేస్తే పచ్చిపోన్రా గురూ. నువ్వొచ్చేయ్, నీ వైఫుకి చెప్పు రేపు మార్నింగ్‌కి లారీవచ్చి మీ గుమ్మం ముందుంటుంది."

గోవిందరావు నిస్సహాయంగా గోడమీద కేలండర్ గర్ల్‌కూడా బట్టల్లేకుండా బే ఖాతరుగా నవ్వుతోంది.

"నీ పూడ కానీయ్ ఐ విల్ కం అండ్ జాయిన్యూ."

"యస్ కమాన్ క్విక్."

ఫోను పెట్టేశాడు శాస్త్రి. గోవిందరావు గనక హోటల్కు వెళ్ళకపోతే వాడొచ్చేస్తాడు, వస్తే యింకా గొడవై పోతుంది. ఇటు అర్ధాంగి అనంతలక్ష్మి - అటు బాల్యమిత్రుడు శాస్త్రి - వాడొచ్చాడు వాడు నా బెస్ట్ ఫ్రెండేనంటే అది వినిపించుకోదు. మా వారికి అడవిలోకెళ్ళినా అక్కడో బెస్ట్ ఫ్రెండుంటాడు. మందుగాళ్ళంతా మీ బెస్ట్ ఫ్రెండ్సే - జేబులు వూడ్చేయడానికంటుందదిటాంటింగా. గోవిందరావు షేక్స్పియర్ పడ్డ అవస్థలో పడ్డాడు. ఒక బ్రెయిన్‌వే వచ్చింది. విమ్మీ కాళ్ళట్టుకుంటే, విమ్మీ కాళ్ళందంగా వుంటాయి. విమ్మీ కళ్ళు చేపల్లా తళ తళ లాడే నీటిలో పరిగెత్తే మత్స్యాల్లా విమ్మీ చూపుల్ని వేయించుకుని కూరొండుకు తినొచ్చు. ఈ మత్స్యయంత్రాన్నెవడు కొడతాడో...

"విమ్మీ నాకో చిన్న హెల్ప్ చేసిపెడ్తావా?"

తలాడించింది ఓరగా చూసి కోరగా నవ్వుతూ.

"నువ్వూ మా లక్ష్మి లారీ ట్రాన్స్‌పోర్ట్‌కెళ్ళి టు పే కట్టి యల్. ఆర్. విడిపించి సామాన్లు బండిలో వేసిపెట్టాలి."

"మరి మీరు..." ఏడిపించేలా వుంది ముద్దుగుమ్మ.

"నాకో అర్జంటుపని తగిలింది. నువ్వాపని చేసిపెడితే మిమ్మల్నిద్దర్నీ పిక్చర్‌కి తీసుకెళ్తాను. సో ప్రామిస్."

"ప్రామిస్" అంది విమ్మా.

ఇంతలో ఏకాంతాన్ని పసిగట్టినట్లుంది ఇల్లాలు. కొంప మునిగిపోయినట్లు పనిపిల్లని తరిమింది - "అమ్మగారు మిమ్మల్ని అర్జంటుగా రమ్మంటున్నారు పైకి"ని కబురొచ్చింది. "లారీ గురించే మాట్లాడుతున్నాం వచ్చేస్తున్నానని చెప్పు" అని లేవ బోతుండగా విమ్మా అడిగింది, "ఎవరా ఫ్రెండ్" అని.

"ఓ ప్రొడ్యూసరు. దేవుళ్ళాటి మనిషి, మన సలహా లేందే అడుగు ముందుకెయ్యడు, మంచి లవ్ స్టోరీ కావాలండీ అన్నాడు. ఇప్పుడెళ్ళాక వొండుతాం."

విమ్మాకి సినిమాల పిచ్చి - గోవిందరావుని కదలనివ్వ కుండా కాఫీ పట్టుకొచ్చి యిచ్చి "మరి నాకో చాన్స్ యిప్పిస్తారా" అని ఆశగా అడిగింది.

"మా ఆవిడతో లారీ ఆఫీసుకెళ్తే - నీకేం కావాలంటే అది యిప్పిస్తా."

విమ్మా ఆలోచిస్తూ నసిగింది. "మీ మిసెస్ నాతో సరిగా మాట్లాడదండీ."

"నాన్సెన్స్ నేను చెప్తాగా" అంటూ లేచి గృహప్రవేశం చేయబోయాడు. గుమ్మం దగ్గరే అనంతలక్ష్మి -

"ఏం దాన్నొదిలి రాలేకపోయారా? అక్కడే వుండక పోయారా? దాన్తో మీకేం కబుర్లు? ఛీ సిగ్గులేదు" అని సోక్రటీస్ నెత్తిమీద పెళ్ళాం నీళ్ళు దిమ్మరించినట్లు కుండల్తో అనుమాన జలాన్ని వంపేస్తోంది.

"అదీ యిదీ అసలు, పాపం చిన్నపిల్ల."

"అది చిన్నపిల్ల - నేనేమో పెద్ద దయ్యాన్ని."

"సర్లే వూరుకో-అరవకు."

"అసలు మీకు టెలిఫోన్ వచ్చిందా లేక అది అలా చెప్పి పిలిపించుకుందా."

"ఛ ఛ అవేం మాటలు - వీమ్మా చిన్నపిల్ల - దాన్నే మన్నా అనుకుంటే కళ్ళు పోతాయ్."

"అంటే నా కళ్ళు పోవాలనే మీరు కోరుకుంటున్నా రన్నమాట. ఈ చిరుతిళ్లూ, చిలిపిబుద్ధులూ మీకు పోవన్న మాట."

"ఇదిగో నస పెట్టి చంపకు. నా కవతల ఎమర్జంటు కొంప లంటుకుపోయే పనులున్నాయి మేక్ ఫ్రండ్సు - డోంట్ మేక్ ఎనిమీస్."

"అంటే మీకు తందాన తాన పాడేంత తెలివితక్కువ దాన్ననుకుంటున్నారా!"

"నైబర్ని ప్రేమించమని బైబిల్లో చెప్పాడు. ఆ అమ్మా యితో నవ్వు సరిగ్గా మాట్లాడవుట-ఏమిటే నీ కథ!"

"ఓరి దేవుడోయ్! దాన్ని వెనకేసుకొచ్చి నన్నాడి పోసుకు నేదాకా వచ్చిందా!"

"ఈ యింట్లో శాంతి వుండాలా అక్కర్లేదా!"

"అదెవరు? దాన్ని కూడా తెస్తారా నా పీకలమీదకి."

"ఏడు. ఇక నీకెవరూ చెప్పలేరు. నువ్వు పట్టిన కుందే లుకి మూడేకాళ్ళు"

"మీ కుందేలు కెన్ని కాళ్ళున్నాయేవిటి?"

"ఇదిగో డియర్ లేనిపోని అనుమానాలు పెట్టుకోకు. నేనవతల ఓ పెద్దమనిషితో బిజినెస్ వ్యవహారం మాట్లాడాలి. నాకోసం మద్రాసునుంచి వచ్చి ఇంటర్వ్యూ అడుగుతున్నాడు వెళ్ళాలా వద్దా!"

"మరి లారీ ఆఫీసుకెళ్ళి ఉయ్యాల పట్టావడం సంగతి?"

"అదే ఆలోచించా. పాపం విమ్మో సాయం చేస్తానంది మీరిద్దరూ వెళ్ళి ఆ సామాన్ను విడిపించుకు తెండి. నేనీ లోగా గెస్టును పలకరించి అట్నుంచి నరుక్కొస్తాను."

"అయితే దాన్ని నాకు తగిలిస్తావన్నమాట! మీకప్పుడే తెల్లారకుండా ఎవడండి తలకుమాసినవాడు దొరికిందీ! మీ ప్రోగ్రాములు మీవి. యివతల ఎవరేమైపోయినా మీకు పట్టదు."

"సొంతపన్లు చిన్న చిన్నవి చేసుకోడం అలవాటు చేసు కుంటే సుఖపడతావు. గుడ్‌ఫర్ నత్తింగ్‌గా పెంచినందుకు

మీ డాడీ ననాలి. నువ్వింత అన్‌సోషల్ సోషలిస్టులా ఎలా తయారయ్యావ్?"

"శపిస్తున్నారా? అయితే వినండి. మీరు లారీ ఆఫీసు కెళ్ళాలి. వెళ్తారు. ముందాసామాను విడిపించుకొచ్చిం తరవాత వూరేగండి ఇదిగో లారీ రశీదు."

"ఈ ఉత్తరం ఏవిటె? అల్లుడు చిరంజీవి గోవిందరావుని పుత్రపౌత్రాభి వృద్ధిగా దీవించి మీ మావయ్య శీతారామయ్య వ్రాయునది. అమ్మాయి కోరినట్లు అటకమీంచి దించిన చిలకల పందిరిలో వున్న గిలకల ఉయ్యాల, బుల్లి తిరగలి చిన్న రుబ్బురోలు, పొత్రం. ఇత్తడిపొన్ను రోకలి, నీళ్ళు నిలవ పెట్టు కుందుకు చిన్న గంగాళం లారీద్వారా పంపుతున్నాను. లారీ రశీదు టుపే చెల్లించి వాటిని జాగ్రత్తగా దింపించుకోగలరు. ఉయ్యాలతోపాటు ఉయ్యాల గొలుసులు కూడా పంపుతున్నాము అవి జాగ్రత్త!"

ఉత్తరం చదివి గోవిందరావు కంగు తిన్నాడు.

"ఇవన్నీ ఎందుకు పంపడం? ఈ రాళ్ళూ రాపావళాలు తెమ్మని ఎందుకు రాశావు?"

"ఇంట్లోకి అవసరం అన్నాను. తిరగలికోమాటు, రోలుకోమాటు, రోకలికోమాటు యిల్లిల్లూ తిరగలేను. పిల్లకి ఉయ్యాల్లో పడుకోడం అలవాటు."

"అసలా డబ్బు పంపిస్తే అవన్నీ యిక్కడ మనవే కొనుక్కునేవాళ్ళంగా దర్జాగా"

"ఆ పంపించిన డబ్బులన్నీ యిదివర కేమయాయో ఇదీ అదే అవుతుంది. పైగా ఆ ఉయ్యాల అచ్చొచ్చిన ఉయ్యాల."

"మీ నాన్న పంపిన డబ్బంతా తినేశానంటావు అవునా?"

"తిన్నారో తాగారో అదంతా అనవసరం నాకుఇంట్లోకి వస్తువులు అమరాలి. మిమ్మల్ని నమ్ముకుంటే కుక్కతోకే."

"మాటలు జోరుగా వస్తున్నాయి? నాలాటి కల్చర్డు పర్సన్ని నెత్తిమీదెట్టుకోవడంపోయి నానా మాటలూ అంటావా? ఇదేనా మీ వాళ్ళు నీకు నేర్పించింది?"

"అ ర వ క ం డి దెబ్బలాడుకుంటున్నావనుకుంటారు. పొద్దున్నే. స్నానం చేద్దురుగాని కదలండి."

ఇంతలో టెలిఫోను మీ కేనంటూ మళ్ళీ పిలుపొచ్చింది.
"అదుగో మీ కుందేలు పిలుస్తోంది పాపం!"

పళ్ళు పటపటలాడిస్తూ పరిగెత్తాడు గోవిందరావు. ఈసారికూడా ఫాలోఅయింది మెట్లదాకా అనంతలక్ష్మి తన నిజ మనోనాథుడ్ని ఓ కంట కనిపెట్టాలని.

అవతల లైనుమీదున్నాడుశాస్త్రి, లైనంతా మత్తెక్కిపోయినట్లు వూగిపోతోంది.

"గురూ నువ్వొస్తావా- నన్ను ఈషీపాతో మీ ఇంటికి రమ్మంటావా?"

"వొద్దు గురూ, నేనొస్తున్నా. నువ్వు పెట్టేయి."

"అటుచూస్తే బాటిల్, యిటు చూస్తే భార్య ఎవరి మాట వినాలి?"

*  *  *

డియర్ విమ్మా-

నీకు సినిమా ఛాన్సు యిప్పించేందుకు ట్రయిచేస్తు న్నాను. నేనే నిన్ను దగ్గిరుండి తీసుకెళ్ళి మద్రాస్ స్క్రీన్ టెస్టులూ వాయిస్ టెస్టులూ చేయించి తీసుకొస్తాను. బైదిబై లారీ రశీదు ఓ ఫార్టీ రూపీస్ హోటల్ బాయ్‌కిచ్చి పంపిస్తు న్నాను. నువ్వన్నట్లు మా ఆవిడ నసశిరోమణి, నసాభినేత్రి. దానితో చెప్పకోకుండా నువ్వు లారీ ఆఫీసుకెళ్ళి సామాన్లు విడి పించి వాటిని మా ఇంటికి చేర్పించి - నే పంపినట్లు ఇంట్రెప నియ్యి. ఈ ఉపకారం నువ్వు నాకు చేస్తే చచ్చి నేన్నీ కడు పున పుడతాను (వొద్దులే - నీకిన్కన్వీనియన్స్). నీ బెస్ట్‌ఫ్రెండ్ యస్. గోవిందరావు.

హోటల్ మమతాలో, మెల్లకక్కుండానే- ఈ అరేంజ్ మెంట్ చేసి, బాయిని చీటీతో, మనీతో, ఎల్. ఆర్. తో విమ్మాని కలుసుకుందుకు పంపించి "విజిల్" వేసుకుంటూ పైకి నాలుగొందల నాలుగు గదిలోకి పాదం పెట్టాడు. ఆ గది ఓ గుహలానూ అందులో శక్తిపూజచేస్తున్న మాంత్రికుడిలానూ వున్నాడు శాస్త్రి. అమ్మవారికి ఎవరి తల నరికి యివ్వాలా అని ఆలోచిస్తున్నట్లు శాస్త్రి కనిపించాడు. గోవిందరావుని చూడ

గానే మన్మథ భాషలో పలకరించి సీసాని ముందుకు తోశాడు. నీకు కావల్సినవి ఆర్డరిచ్చుకో మన్నాడు.

మురార్జీ దేశాయి ప్రొహిబిషన్ ఇంట్రడ్యూస్ చేస్తే సవుత్‌లో జనతా గెలవటం కష్టం అని శాస్త్రి సారా లెక్చర్ దంచాడు. ఇందిరాగాంధిని అరెస్ట్ చేయడం ఎవడితరం కాదన్నాడు.. రుక్సానాసుల్తానా, అంబికాసోనీ అందంగా వుంటారన్నాడు. సంజయ్‌గాంధి గురించి గంటన్నర, ఆంధ్రా స్టేట్ పాలిటిక్సుగురించి గంటా, నక్సలైటు గురించి గంటా. రాజ్‌నారాయణ్ గురించి క్షుణ్ణంగా మాట్లాడేసి — గోవిందరావుకి బ్రెయిన్ వాషింగ్ చేశాడు. ఇద్దరూ ఒక సెషన్ లాగించేసరికి పూర్ణపురుషులయ్యారు. అప్పుడు శాస్త్రి—చిన్నకార్లో గుంటూరెళ్ళి రాత్రికి తిరిగివద్దాం అక్కడో పెద్ద కుంపటి వుందన్నాడు మికాస్‌రీగలూ, జానీవాకరూ, బ్లాకండ్‌వైటూ, చికెన్ రోస్టులూ మనకోసం ఎదురుచూస్తున్నా యన్నాడు. అక్కడ గరల్స్ నూడ్‌గా శర్వ్యుచేసే ఏర్పాటుంది- గ్రాండ్ గేలాగా వుంటుంది రమ్మన్నాడు. మధ్యలో జస్టేమినిట్ - మీ ఇంటికి పంపించమని లారీవాళ్ళకి ఫోన్ కొట్టేశానన్నాడు. గోవిందరావు తన లైఫంతా రూయినయి పోయిందనీ, వైఫ్‌లైఫ్ లాగేస్తుంటని, మందు ముట్టుకుంటే మండిపడిపోతుందని ఏకరువు పెట్టాడు. ఈ ఆగస్టు దాటాక నీకు మంచి డేస్ వస్తాయని గోవిందరావుని, శాస్త్రి ఓదార్చి గుంటూరు టాక్సీలో పట్టికెళ్ళారు.

* * *

కొంచెం తూలుతూ భూమి తన చుట్టూ తాను రెండు ప్రదక్షిణాలు చేసింది. కొంచెం తూలుతూ మళ్ళీ కాలు నిలదొక్కుకుంటూ గుంటూరు టొబాకో కంపెనీవారి వాన్ లోంచి ఇద్దరి సాయంతో దిగాడు గోవిందరావు. గుమ్మం ముందు వెన్నెట్లో రెండులారీల యిసక కొండలు వెండికొండల్లా మిలమిలా మెరిసిపోతున్నాయి. ఈ యిసక ఎవరు తెప్పించార్లో మనకెందుకు లెమ్మని అడుగులు కూరుకుపోతున్నా ధైర్యంగా కాలు నిలదొక్కుకుంటూ మెట్లన్నీ ఎక్కి, పెళ్ళికి ప్రెజెంట్ చేసిన కాలింగ్ బెల్‌ని భయపడుతూ నొక్కాడు. తలుపు ఓర వాకిలిగా అరమూసిన జ్ఞాని నేత్రంలా తెరుచుకుంటుంది.

"అయామాల్రైట్. థాంక్యూ ఫరాల్ ది కైండ్నెస్. థ్యాంక్యూ యిసక జాగ్రత్త" అని వాహకుల్ని హెచ్చరించి తలుపు కొంచెం తోశాడు. ప్రమాద వీణలా కమాచి పొడగ ప్రమాద వీణలా అనంతలక్ష్మి తెల్లచీరలో తెల్లని చల్లని తల్లిలా మెల్లగా తలుపుతీసి—"యిప్పటికా ఇల్లు కనిపించింది?" అని సన్నగా నొక్కుతూ భుజంమీద చేయివేసి లోనికి లాక్కుంది.

గోవిందరావు అనంతలక్ష్మిని గాఢంగా వాటేసుకుని— "ఐ లవ్యూ - ఐ లవ్యూ - లక్ష్మి ఐ లవ్యూ - అయాం సారీ లక్ష్మి. గుంటూరు పార్టీకెళ్ళాను. ఆ వెధవ ఆ శాస్త్రిగాడు లాక్కుపోయాడు. నీ పవిత్రమైన పాదాలు సాక్షిగా నేనే పాపం చెయ్యలేదు. నన్ను క్షమించవా నా జీవితలక్ష్మీ, మై

డియ్యర్! మై డార్లింగ్! మెడమీద ముద్దులెట్టేసుకుని లోప లకు నడిచాడు క్రుంగిపోతున్న కుతుబ్ మీనార్లా.

"పర్లేదులెండి అలవాటేగా-మాట్లాడకండి...పాప నిద్ద రోతోంది. అదిగో ఉయ్యాల జాగ్రత్తగా రండి" అని తన మెడమీద ఆన్చిన గోవిందరావు తలనునిమురుస్తూ వీప్మీద చల్లగా మెత్తగా గాజుల చేత్తో గలగల్లాడగా రాసింది.

"ఉయ్యాల ఉయ్యాలొచ్చిందా? థాంక్సు టు ది అన్నోన్" అని చేతులెత్తి దండం పెట్టాడు. అంత మైకంలోనూ అతనికి మిస్. విమ్మో తన పరువు కాపాడిన "బెస్టు ఫ్రండ్ లా లప్లీ గా కనపడింది.

భార్య అమ్మశక్తిలా విరుచుకుపడిపోకుండా సవ్యంగా ప్రేమగా ట్రీట్ చెయ్యడం ఉయ్యాయ మహాత్మ్యమేనని అతను గాఢంగా నమ్మి 'నీ రుబ్బురోలూ, బుల్లి తిరగలీ, రోకలీ అన్నీ వచ్చాయా?' అన్నాడు.

"ఆ అన్నీ వచ్చాయి! పడుకోండి మాట్లాడక" అని మజ్జిగ తాగించి - పడుకోపెట్టి మీద చేయి వేసుకుని దగ్గరగా జరిగింది.

"అవును రెండు లారీల ఇసకెందుకు వేయించారు కొంప ముందు" అని ఆశ్చర్యపోతూ అడిగింది లక్ష్మి.

"ఇసకా— ఇసకలారీలు— వాడే ఆ శాస్త్రి పంపించుం టాడు వెధవ- వెధవజోకూ వీడూను."

"పోన్లెండి. మీరలా వెళ్ళారు మా అమ్మ నాన్న వచ్చారు. అమలాపురంనుంచి."

గోవిందరావు మంచంమీద లేచి కూర్చుని అనంతలక్ష్మిని దగ్గరకు తీసుకుంటూ— "నువ్వు రమ్మని రాశావా?" అని భయపడిపోతూ నసిగాడు.

"లేదు మా నాన్నగారికి ఈ ఊరు గవర్మెంట్ కాలేజీకి ట్రాన్ ఫరయిందట."

గోవిందరావుకి సగం నిషాదిగి పోయింది. "వాళ్ళెక్కడే వుంటారా" అని అడగబోయి మనకెందుకులే అని నోరుమూసుకున్నాడు.

"భోంచేశారా!" అని జుట్టులోకి చేతులు పోనిచ్చి, అతను తలాడించగానే "మీరు చూళ్ళేదుగాని మన పాప ఉయ్యాల్లో ఎంచక్కా ఆడుకుంది నవ్వుతూ" అని సంతోషంగా చెప్పింది.

అమర్యాదగా రిసీవు చేసుకుని అల్లరి పెడుతుందనుకున్న అర్ధాంగి అనంతలక్ష్మి నవ్వుల నదిలో పువ్వుల పడవలా కలకల్లాడుతూ "క్షమయాధరిత్రి" అన్నంతిగా ప్రవర్తించడం గోవిందరావుకి ఆశ్చర్యం వేసింది. ఇది ఇంద్రజాలమా లేక కుట్రా అని క్షణం తటపటాయించి మల్లెచెండుతో కునేగా సెంటుతో ఘుమ ఘుమ లాడిపోతున్న అందాలభామను నువ్విక్కడ కాదు. యిక్కడ అంటూ మీదకు లాక్కున్నాడు, పువ్వులతోట మీదకు మెత్తగా వెన్నెల పరుచుకున్నట్టు, పురుషునిమీదకు చేసుకున్న పుణ్యంలా ఆమె విస్తరించింది.

అలా ఓ ఝాము గడిచాక యిద్దరూ యిటూ అటూ ఒత్తిగిలి ప్రబంధ ఫక్కీలో మత్తేభంపక్క చంపకమాలలా సర్దుకున్నారు.

తెలవారు జామున, గోవిందరావు బాత్రూంకోసం లేచి వెళ్ళి వస్తూంటే — ఎవరో ఆడమనిషి సన్నగా ఏడుస్తూ మధ్య మధ్య నీరసంగా ఎవర్నో మందలిస్తూన్నట్లు లీలగా వినిపించింది. ఆ గొంతుక అత్తగారిది, ఆ మందలింపబడుతున్న మంద భాగ్యుడు మావగార్నీ గ్రహించి గోవిందరావు ఆశ్చర్య పోయాడు. వాళ్ళిద్దరి పోట్లాటకూ, అనంతలక్ష్మి తనను అల్లరి పెట్టకుండా హత్తుకుపోడానికీ ఏదో రహస్య కారణం వుండి వుండాలి. అమ్మదొంగా అని లక్ష్మిని మరోసారి ముద్దాడి వాటేసుకుని ఆనందంగా పడుకున్నాడు గోవిందరావు.

నససామ్రాట్ గోవిందరావు ఎనిమిదింపావుకి లేచిన ఆనందం పట్టలేక ఆకాశం మల్లెపూల జల్లులా చిట్టిపొట్టి చినుకుల్తో జల్లుకొట్టింది. పాపాయి ఉయ్యాలలో ఆడుకుంటోంది. నడుం బిగించి చూడముచ్చటగా లాంగ్‌షాట్‌లో రోట్లో పసుపుకొమ్ములు దంచుతోంది సవిలాసంగా అనంతలక్ష్మి.

అత్తగారు వేడి వేడి పెసరట్లను వెండికంచంలో ఒక దాని మీదొకటి వేసి వెండి మరచెంబుతో లోపలికివచ్చి టీపాయ్‌మీద వాటినుంచి వెనక్కి తిరిగి వెళ్ళిపోబోయారు. ఆవిడ పెద్దాపురం పట్టుచీర కాశపోసి కట్టుకున్నారు. కాళ్ళకు

కడియాలు, వెండి గొలుసులు, పాదాలకు కొమ్ము పసుపు రాసుకున్నారు. కాని ఆవిడ మొహం చాలా దిగులుగా పెట్టారు.

"ఏమత్తయ్యా అలావున్నారు?" అని చాలా నెమ్మదిగా భక్తిగా అడిగాడు గోవిందరావు.

ఆ పలకరింపుకీ ఆమె గొడ్డలి వ్రేటుకు వాలిన మంచి గంధం చెట్టులా గుమ్మానికి జారబడిపోయి కూర్చుని కళ్ళు తుడుచుకుంటూ వ్రేలితో గడపమీద రాస్తూ వుండిపోయారు.

"చెప్పండి అత్తయ్యా మీ ఒంట్లో బాగులేదా?" అని లేచి ఆవిడ కెదురుగా నేలమీద భాసింపట్టు వేసుకుని కూర్చుని పెసరట్టు తింటూ గోవిందరావు- "మీ అమ్మాయికి యిక్కడ ఏమన్నా యిబ్బందిగా వుందని మీరు బాధపడుతున్నారా?" అని రొక్కించి అడిగాడు.

అప్పుడామె బావురుమని తెప్పరిల్లి—

"ఆ క్రిందనుంచే ఆ దిక్కుమాలిన పిల్ల — సిగ్గులేకుండా మగరాయుళ్ళ లాగూలూ చొక్కాలు వేస్తుంది. దాంతో కాలక్షేపం మొదలెట్టారు. మీ మావగారి గుణం అట్టే మంచిది కాదు నాయనా! ఆ పిల్లని తీసుకుని సినిమాల కెళ్తున్నారు. దాన్ని పైకి రప్పించుకుని షేక్స్పియర్ చెబుతున్నానంటున్నారు. అదా మంచి వయసులో వుంది. ఈయనా దాన్ని చూసి వెర్రెత్తిపోతున్నారు. ఏం జరిగినా అంతా మొహంమీద ఉమ్మేస్తారు, ఈ వెర్రివేషాలేమిటని అడిగితే నువ్వు ఉంటే ఉండు, పోతే పో అంటున్నారు. దాన్తో లారీ ఆఫీసుకి ఆటోలో ఏ ముహూర్తాన వెళ్ళారో అప్పట్నుంచీ దానికి అతుక్కు-

పోయారు. ఇప్పుడు నాకీ అవమానం అని చాలా బాధగా వుంది నాయనా" అని కళ్లొత్తుకున్నారు.

గోవిందరావు లేచి నిలబడి — "మీరూరుకోండి అత్తయ్యా!" అని "ఇదిగో లక్ష్మి యిలా రా" అని అధార్టీగా కేక వేశాడు.

లక్ష్మి చెంగుతో చెంపలొత్తుకుంటూ బితుకు బితుకు మంటూ అపరాధిసిలా వచ్చి నిలబడింది. గోవిందరావు గొంతు పెంచి "వింటున్నావా అత్తయ్యగారు చెప్పింది" అని గర్జించాడు.

"మీకు పుణ్యం వుంటుంది. కాస్త నెమ్మదిగా మాట్లాడండి" అంది లక్ష్మి ప్రాధేయపడుతూ.

"చూడు లక్ష్మీ! విమ్మీ చిన్నపిల్ల. కాస్త ఫ్రీగా సరదాగా వుంటుంది. అంతమాత్రంచేత ఆ పిల్లపై చనువు తీసుకోడం రోమియోలా వెంటబడటం నాకెంత అప్రతిష్ట! ఆ అమ్మాయికి షేక్స్పియర్ చెప్తానని, సినిమాలకీ, షికార్లకీ తీసుకెళ్తున్నాట్టగా మీ నాన్న-ఇలాటిపన్లు మన ఇంటా వంటా లేవు. మీ నాన్నకు నువ్వు చెప్పాలి తెల్సిందా!" చూపుడు వ్రేలితో లాయర్లా నిర్దేశిస్తూ అన్నాడు గోవిందరావు.

లక్ష్మి బిక్క-మొగంపెట్టి "నాన్నారితో నేనేం మాట్లాడనండీ! మీరే సరిచెయ్యాలి. మీకు పుణ్యం వుంటుంది—" అని వాళ్ళ అమ్మ పక్కన పెద్ద బిందె పక్క- చిన్న కూజాబిందెలా చతికిలపడ్డింది.

"అత్తయ్యా మీ అమ్మాయి నేను ఒక్కరోజు కాస్త ఆలస్యంగా వస్తే నానా అల్లరి చేస్తూంది. ఇప్పుడు నాన్న రోమాన్సులు ప్రారంభిస్తే—గట్టిగా కేక వెయ్యద్దూ?"

"నాకు మా నాన్నంటే చచ్చేభయం. నేనేం మాట్లాడతానూ" అని నసిగింది.

"అత్తయ్యా మీ మంచితనం మీ భక్తి మిమ్మల్ని కాపాడతాయి మీ అమ్మాయిని జువ్వలా ఎగరద్దని చెప్పండి. మీరిక యీ సంగతి మర్చిపోండి, నేనా అమ్మాయితో మాట్లాడతా" అని గోవిందరావు నెమ్మదిగా కిందకెళ్ళి విమ్మాని పిలిచి—

"ఏంటె విమ్మా మా మావగార్ని ఏడిపిస్తున్నావూ!" అని నవ్వుతూ అడిగాడు.

"మరి మీ ఆవిడ నన్నేడిపించితే - టిటి ఫర్ టాట్" అంది కిల కిలా నవ్వుతూ.

"థాంక్యూ విమ్మా-యు హేవ్ సేవుడు మీ ట్రంస్లాటర్-బట్ స్టాప్ దిస్ గేం" అని ఆమె కళ్ళలోకి చూశాడు గోవిందరావు

"నమస్తే" అని కర్టెన్ లాగేసి సముద్రంలోకి జారుకున్న మత్స్యసుందరిలా యింట్లోపలకి పారిపోయింది. గోవిందరావు మెల్లెక్కుతూండగా యిసకలో కూరుకుపోయిన చెప్పు లాక్కుంటూ వస్తున్నాడు. గోవిందరావు మామ యింగ్లీషు లెక్చరర్ సీతారామయ్య యం. ఏ.

★